కేటీఆర్‌ను చూస్తేనే కాంగ్రెస్‌కు వణుకు

- సమస్యలపై నిలదీస్తున్నాడనే అక్రమ కేసులు
- కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే రాష్ట్రం అగ్నిగుండమే
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ హెచ్చరిక

సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 24: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజల పక్షాన పోరాటం చేస్తున్న కేటీఆర్‌ను చూస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకు పుడుతోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చార్ సౌ బీస్ హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న డిమాండ్‌తో కేటీఆర్ నిరంతర పోరాటం చేస్తున్నారన్నారు. సమస్యలపై నిలదీస్తున్నాడనే అక్కసుతోనే ప్రభుత్వం కేటీఆర్‌పై అక్రమ కేసులు పెడుతుందని ఆరోపించారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారని కొనియాడారు. అభివృద్ధి లక్ష్యంగా పనిచేసిన కేటీఆర్‌పై తప్పుడు కేసులు పెడుతున్నారన్నారు. కేటీఆర్‌ను టచ్‌చేస్తే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంపై దృష్టి సారించాలని హితవు పలికారు. రైతులుకు రుణమాఫీ లేదు, వృద్ధులకు రూ.4 వేలు పింఛన్ ఇస్తలేరు ఇటువంటి ఏ ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేయలేదన్నారు. అక్రమ కేసులు ఎన్నిపెట్టినా భయపడే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ముగ్దం అనిల్ గౌడ్, మట్టె శ్రీనివాస్, కోడం వెంకటేశ్, సాయి, రుద్రవేణి సందీప్, రంజిత్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు టీపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్త ధర్నా

కలెక్టరేట్, డిసెంబర్ 24 : సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలుపుతూ మంగళవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు రాష్ట్ర ధర్నాకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న 15వ రోజు దీక్షకు మంగళవారం సంఘీభావం తెలిపి, సమస్యల సాధన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమగ్రశిక్ష ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించే ధర్నాకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామనాథ రెడ్డి, బండి ఉపేందర్, పర్వతి తిరుపతి, చకినాల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

గౌరవనీయులైన జూనియర్ సివిల్ జడ్జి గారి న్యాయస్థానం, వేములవాడ కోర్టు

IA.No. 644 of 2024
IN
O.S. No. 17 of 2024

వీరి మధ్య

పి.ఎ.సి.ఎస్. లిమిటెడ్ వేములవాడ కార్యదర్శి మిట్ట లక్ష్మయ్య ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

మరియు

కెంద గంగాధర్ మరియు ఇతరులు ...ప్రతివాదులు

వీరికి

D2 కెంద గంగాధర్ S/o. మల్లయ్య, Age 55, వృత్తి: వ్యవసాయం
D3 కెంద సంగీత W/o. గంగాధర్, Age 41, వృత్తి: ఇంటి గృహిణి
గ్రా॥ బావుసాపేట, మం॥ కోనరావుపేట, జి॥ రాజన్న సిరిసిల్ల

పైన తెలిపిన వాది OS No. 17 of 2024 మరియు I.A. No. 644 of 2024 లోని కేసులో మిమ్మల్ని ప్రతి వాదిగా చేర్చియున్నారు. ఇట్టి కేసులో మీ హాజరు కొరకై తేది. 30-12-2024 రోజున వాయిదా ఉన్నది. ఇట్టి తేదిన ఉదయం 10-30 గంటలకు మీరు గాని, మీ యొక్క న్యాయవాది ద్వారా గాని కోర్టు ముందు హాజరు కాగలరని కోర్టు ఉత్తర్వులు జారీ చేసినది. ఒకవేళ మీరు గాని, మీ న్యాయవాది గాని హాజరు కానిచో కోర్టు ఆదేశాల మేరకు మీకు పరోక్షంగా నిర్ణయం తీసుకోగలరు.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు.. సం/- **గుడిసె సదానందం,** MA,LLB, అడ్వకేట్
శాత్రాజుపల్లి, వేములవాడ. సెల్: 94405 44457.

వరికొయ్యలను కాల్చొద్దు

రుద్రంగి, డిసెంబర్ 24: వరికొయ్యలను కాల్చొద్దని, భూమికి దోహదపడే సూక్ష్మజీవులు నశించి, భూసారం తగ్గి దిగుబడి తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి ప్రియదర్శిని తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వరి కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై వ్యవసాయ అధికారులు మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాటు వేసే ముందు వరి కొయ్యలను దుక్కిలో కలియ దున్నితే సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి జ్యోతి, రైతులు పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

వేములవాడ, డిసెంబర్ 24: వేములవాడ పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు కనీస వసతి సౌకర్యాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. మంగళవారం మహాలక్ష్మి వీధిలో ఆయన రహదారులు, మురికి కాలువలను పరిశీలించి మాట్లాడారు. పట్టణ విస్తీర్ణం పెరిగిపోయి శివారు కాలనీలో కనీస వసతి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. మురుగు కాలువలు, రహదారులు లేక అవస్థలు పడుతున్నారని, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇక్కడ ఆయనతోపాటు కాలనీవాసులు చంద్రయ్య, లక్ష్మీ రాజం, అంజయ్య తదితరులున్నారు.

పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

గంభీరావుపేట, డిసెంబర్ 24: వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున ఇంటి దగ్గర తమ పిల్లలను ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ చదివించాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మంగళవారం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీధర్ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు 90 రోజుల ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులున్నారు.

అటవీ భూమిని సాగు చేస్తున్న వారిపై కేసు నమోదు

చందుర్తి, డిసెంబర్ 24: చందుర్తి మండలం సనుగుల అటవీ భూమిని అక్రమంగా సాగు చేస్తుండగా అటవీ శాఖాధికారులు మంగళవారం ట్రాక్టర్‌ను పట్టుకొని చందుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అటవీ శాఖాధికారుల కథనం ప్రకారం, అటవీ భూమిని సాగుచేస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించినప్పటికీ వినకుండా, మండలంలోని సనుగుల గ్రామానికి చెందిన పిట్టల లచ్చయ్య పత్తి కోసం పొలం సాగు చేసేందుకు కేజీవీల్ ట్రాక్టర్‌తో దున్నుతుండగా సనుగుల బీట్ ఆఫీసర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి, పిట్టల లచ్చయ్యతోపాటు ట్రాక్టర్ డ్రైవర్ ముచ్చర్ల ఎల్లయ్యపై కేసు నమోదు చేసినట్లు వేములవాడ ఫారెస్ట్ రేంజ్ అధికారి ఖలీయుద్దీన్ తెలిపారు. ఈ దాడుల్లో ఫారెస్ట్ సెక్షన్ అధికారులు అబ్దుల్ హుస్సేన్, అన్వర్ హుస్సేన్, బీట్ అధికారులు బాలకృష్ణ, సుదర్శన్ బేస్ క్యాంప్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, డిసెంబర్ 24 : మండల కేంద్రంలో మంగళవారం ఎస్ఐ కదిరె శ్రీకాంత్ వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనదారుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, పొల్యూషన్, హెల్మెట్ తనిఖీ చేశారు. ప్రతి వాహనానికి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని లేకపోతే జరిమానా విధిస్తామని ఎస్ఐ తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME

★Donthula RajiReddy S/o. Donthula Thakkareddy, H.No. 6-67/B, Anupuram, Vemulawada, Rajanna Sircilla Dist, my surname was changed to **Dunthula Rajireddy, S/o. Dunthula Thakkareddy,** my mother name **Dunthula Mallamma** Wife Name **Dunthula Srimathi**
NTK-0000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

అస్తవ్యస్తంగా అంగన్‌వాడీ పాఠశాలలు

- ఎల్లారెడ్డిపేట మండలంలో ప్రమోషన్‌తో ఆరుగురు టీచర్లు బదిలీ
- పర్యవేక్షణ లేక బడికి రాని టీచర్లు
- సెలవు లేకున్నా బడులకు తాళం
- పూర్వ ప్రాథమిక విద్యకు ఆటంకం

బండలింగంపల్లిలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

సింగారంలో తాళం వేసి ఉన్న అంగన్‌వాడీ కేంద్రం

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 23 : మండలంలోని పలు అంగన్‌వాడీ పాఠశాలలు పర్యవేక్షణ కరువై అస్తవ్యస్తంగా తయారయ్యాయి. టీచర్లు తూతూ మంత్రంగా బడికి వెళ్లి ఆయాలకే బాధ్యతలప్పగిస్తుండడం, సెలవు లేకున్నా ఏకంగా బడులకు తాళాలు వేయడంతో పూర్వ ప్రాథమిక విద్యకు ఆటంకం ఏర్పడుతున్న తీరుపై పలు గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎల్లారెడ్డిపేట మండలంలో గొల్లపల్లి, ఎల్లారెడ్డిపేట సెక్టార్‌కు ఇద్దరు సూపర్‌వైజర్లు ఉండడంతో ఇద్దరు ఎప్పటికప్పుడు టీచర్ల విధులను పర్యవేక్షించగా పాఠశాలల నిర్వహణ పకడ్బందీగా ఉండేది. దీంతోపాటు వెంకటాపూర్, పదిర, రాగట్లపల్లి, తిమ్మాపూర్, బొప్పాపూర్‌లోని రెండు సెంటర్ల టీచర్లు సూపర్‌వైజర్లుగా ఉద్యోగోన్నతి పొంది బదిలీ అయ్యారు. బదిలీ అయిన స్థానాల్లో కొత్త టీచర్ల నియామక ప్రక్రియ లేక పోవడంతో ఆయాలే పాఠశాల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నారు. ఐదు నెలల క్రితం బదిలీపై నూతన సూపర్‌వైజర్ రాజేశ్వరికి బాధ్యతలు ఇవ్వడంతోపాటు రెండు సెక్టార్ల బాధ్యతలను అప్పగించారు. సూపర్‌వైజర్ స్థానికంగా లేకపోవడం కరీంనగర్ నుంచి ప్రతిరోజూ రావడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు అంగన్‌వాడీ టీచర్లు తూతూ మంత్రంగా పాఠశాలకు వెళ్తూ ఆయాలకు బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తున్నది. సూపర్‌వైజర్ సుమారు రెండు నెలలకోమారు పాఠశాల విజిట్ చేస్తుండడంతో తమనె ఎవరు చూస్తారనే ధీమాతో టీచర్లు పాఠశాలకు వెళ్లకుండా సొంత పనులు చూసుకుంటున్నారు. మండలంలోని ఓ గ్రామంలోని ఓ పాఠశాలకు చెందిన టీచర్ సుమారు ఐదు రోజుల నుంచి వెళ్లకుండా ఆయాతోనే అన్ని పనుల చేయిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రాథమిక విద్యకు సిద్ధం చేసే పూర్వ ప్రాథమిక విద్యకు ఆటంకం ఏర్పడుతున్నది. సోమ, మంగళవారాల్లో పలు పాఠశాలల్లో టీచర్లు లేకుండా కేవలం ఆయాలే పాఠశాలలు నిర్వహిస్తున్న తీరు కనిపించింది. దీనిపై సూపర్‌వైజర్ రాజేశ్వరిని వివరణ కోరగా డ్యూటీలో ఎలాంటి రాజీలేదని, ఎవరైనా సెలవు పెట్టకుండా పాఠశాలకు గైర్హాజరైతే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుండారంలో..

సోమవారం నారాయణపూర్‌లో పిల్లలను పర్యవేక్షిస్తున్న ఆయా

తిమ్మాపూర్‌లో అంగన్‌వాడీ పాఠశాలలో పిల్లలను చూసుకుంటున్న ఆయా

రైతుల సంఖ్యకు అనుగుణంగా పీఏసీఎస్‌లు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

కలెక్టరేట్, డిసెంబర్ 24: జిల్లాలోని రైతుల సంఖ్యకు అనుగుణంగా నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ పథకం 'సహకార్ సే సమృద్ధి'పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జిల్లా కమిటీ సభ్యులతో మంగళవారం కలెక్టర్, అదనపు కలెక్టర్ భీమ్యానాయక్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డ్ డీడీఎం దిలీప్ పథకంపై వివరించారు. జిల్లాలో మొత్తం 24 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలున్నాయని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, నూతన పీఏసీఎస్‌లు రైతుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇక్కడ డిస్ట్రిక్ట్ కో ఆపరేటివ్ అధికారి రామకృష్ణ, డీఆర్డీవో శేషాద్రి, జిల్లా వ్యవసాయాధికారి అష్జల్ బేగం, జిల్లా ఉద్యానవన అధికారి లత, పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, పౌర సరఫరాల శాఖ మేనేజర్ రజిత, జిల్లా మత్స్య శాఖ అధికారి సౌజన్య, కేడీసీసీబీ సీఈవో సత్యనారాయణరావు, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

ఇల్లంతకుంట, డిసెంబర్ 24 : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన బండ గాలవ్వ (80) సిరిసిల్ల ఏరియా దవాఖానలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఎస్ఐ కదిరె శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, పెద్దలింగాపూర్ గ్రామానికి చెందిన గాలవ్వ కొంతకాలంగా అనారోగ్యం బారినపడుతోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి తను వాడే బీపీ, గుండె సంబంధ మాత్రలను అధిక మోతాదులో వేసుకోవడంతో వాంతులయ్యాయి. గమనించిన ఆమె కుమారుడు దవాఖానకు తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. గాలవ్వ కుమారుడు రామచంద్రం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

గిరిజన మహిళా డిగ్రీ కళాశాలకు న్యాక్ బీ ++

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 24 : తంగళ్లపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల న్యాక్ బీ ++ గ్రేడ్ సాధించినట్లు ప్రిన్సిపాల్ రెహనా ఇప్పత్ తెలిపారు. మొదటి ప్రయత్నంలో న్యాక్ బీ ప్లస్ ప్లస్ గ్రేడ్ సాధించామని పేర్కొన్నారు. న్యాక్ నిపుణుల బృందం ఈనెల 9,10 తేదీల్లో కళాశాలను సందర్శించి, విద్యా ప్రమాణాలను పరిశీలించిందని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో అభివృద్ధి కోసం సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మి అవసరమైన సదుపాయాలను ఏర్పాట్లు చేశారన్నారు. ఈ గ్రేడ్ సాధించడానికి కీలకంగా వ్యవహరించిన వైస్ ప్రిన్సిపల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, పూర్వ విద్యార్థినులను ప్రిన్సిపల్ అభినందించారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు

తెలంగాణ చౌక్, డిసెంబర్ 24: మైనర్లు వాహనం నడుపుతూ పట్టుపడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చంద్రశేఖర్ హెచ్చరించారు. ఈ మేరకు ఇటీవల రుద్రంగి మండలం కేంద్రంలోని బస్టాండ్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో వ్యక్తి మృతికి కారణమైన బాలుడి తల్లి గడ్డం లక్ష్మీపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. కంటే నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఏడాది పాలనలో 49 మంది విద్యార్థుల మృతి

- ఒక్క బాధిత కుటుంబాన్ని కూడా సీఎం రేవంత్ పరామర్శించలేదు
- ప్రతి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారమివ్వాలి

వేములవాడ పట్టణంలో బీసీ విద్యార్థుల వసతి గృహాన్ని పరిశీలించి మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

వేములవాడ, డిసెంబర్ 24: కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ఏడాది పాలనలో 49మంది విద్యార్థులు మృతి చెందారని, ఏ ఒక్క కుటుంబాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించలేదని ఏబీవీపీ రాష్ట్ర విద్యార్థి వసతి గృహాల కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ అన్నారు. వేములవాడలోని బీసీ విద్యార్థి వసతి గృహాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. వేములవాడ వసతి గృహానికి కనీసం రహదారి కూడా లేదని ఆరోపించారు. వసతి గృహం వద్ద పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు కనీసం బస్‌స్టాప్ కూడా లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏడాది పాలనలో 49మంది విద్యార్థులు చనిపోతే కనీసం ఏ ఒక్క కుటుంబాన్ని కూడా సీఎం రేవంత్ రెడ్డి పరామర్శించలేదని విమర్శించారు. విద్యార్థుల మృతులన్నీ ప్రభుత్వ హత్యలేనని మండిపడ్డారు. గురుకుల పాఠశాలకు పక్కా భవనాలు నిర్మించి, వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. మృతి చెందిన ప్రతి కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే మరింత పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్, జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజు రావు, కార్తీక్, వర్షిత్, రామ్‌చరణ్, ఆదిత్య, హరినాథ్, అభినయ్, అజయ్, అశ్విత్ తదితరులున్నారు.

అనుమతి పేరిట ఇసుక అక్రమ రవాణా!

- ప్రాజెక్టు కోసం పర్మిషన్
- సమయానికి ముందే మూలవాగు నుంచే ఇసుక తరలింపు
- టిప్పర్లను పట్టుకున్న పోలీసులు

పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రిప్పర్లు

కోనరావుపేట, డిసెంబర్ 24: ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పేరిట అక్రమ దందా సాగిస్తూ ఇసుకను తరలిస్తున్నారు. ప్రాజెక్టు పనుల కోసం అంటూ అధికారుల వద్ద పర్మిషన్ తీసుకుని సమయం కాక ముందే ఇసుక తరలిస్తూ సొమ్ము చేసుకుంటుకున్నారు. ఈమేరకు మూలవాగు నుంచి రెండు టిప్పర్లలో ఉదయాన్నే ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించగా సాయంత్రం పూట వదిలేశారు. వివరాల్లోకి వెళితే.. కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట, వెంకట్రావుపేట గ్రామాల మధ్యలోని మూలవాగులో చెక్ డ్యాం వద్ద ఇసుకను తీసేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి ఇచ్చారు. దీంతో కథలాపూర్ మండలంలోని కలికోట శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ స్టేజ్ 2, ఫేస్ 1 పనుల నిమిత్తం ఇసుకను టిప్పర్ల సాయంతో తరలిస్తున్నారు. నింబంధనల మేరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇసుక తరలించాల్సి ఉండగా, సమయానికి ముందే ఇసుకను లోడ్ చేసుకుని వెళ్తున్నారు. కొందరు వ్యక్తులు అనుమతి అడ్డుపెట్టుకుని వేములవాడ పట్టణంతోపాటు చందుర్తి, రుద్రంగి మండలంలోని పలు గ్రామాలకు ఇసుకను తరలిస్తూ అమ్ముకుంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈక్రమంలోనే మంగళవారం ఉదయం సమయానికి ముందే ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుక రవాణా సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం ఇసుక టిప్పర్లను పట్టుకొని, సాయంత్రం వదిలేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

బావుసాయిపేట మూలవాగులో ఇసుక తీసే ఎక్సకవేటర్

దొరికితేనే దొంగ..

ప్రాజెక్టు పనుల కోసం రెవెన్యూ అధికారులు ఇచ్చిన అనుమతులను అడ్డుపెట్టుకుని కొందరు వ్యక్తులు మధ్యవర్తులుగా ఉండి అధికార పార్టీ నేతల అండతో విచ్చలవిడిగా ఇసుక రవాణా చేస్తున్నారు. దొరికితే దొంగ లేదంటే దొర అన్నట్లు వ్యవహరిస్తూ

రెండు టిప్పర్లు పట్టుకున్నాం

బావుసాయిపేట గ్రామంలో ఉదయం అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్లను పట్టుకున్నాం. రెవెన్యూ అధికారులు ఇచ్చిన సమయానికి ముందే టిప్పర్లలో ఇసుకను లోడ్ చేసుకుని వెళ్తున్నారు. దీంతో తగిన సమాచారం మేరకు బ్లూకోల్ట్స్ పోలీసులు టిప్పర్లను పట్టుకున్నారు. అనుమతి ఉన్న సమయానికి ముందే టిప్పర్లతో తరలించడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించాం.

-ప్రశాంత్‌రెడ్డి, ఎస్ఐ (కోనరావుపేట)

నిజామాబాద్‌లో గన్నీ సంచులను తరలిస్తున్న హమాలీలు

మిల్లులకు గన్నీ బ్యాగులు

- నమస్తే కథనానికి స్పందించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

కోనరావుపేట, డిసెంబర్ 24: మండలంలోని నిజామాబాద్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంలో అధికారుల నిర్లక్ష్యానికి లక్షల విలువ చేసే గన్నీ సంచులు పాడవుతున్నాయని నమస్తే తెలంగాణ దినపత్రికలో 'ఎండకు ఎండి..వానకు తడిసి' అనే శీర్షిక ప్రచురితమైంది. దీంతో జిల్లా పౌరసరఫరాల సంస్థ అధికారులు స్పందించారు. సింగిల్ విండో పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగొలు కేంద్రంలో మిగిలిపోయిన గోనె సంచులను హమాలీ సాయంతో వాటిని మడత పెట్టించి నెట్టు వేశారు. అంతేకాకుండా మడత పెట్టిన గోనె సంచులను హరిహర సిద్ధ రైస్ మిల్లుకు తరలించనున్నట్లు వెల్లడించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర మంత్రిని బర్తరఫ్ చేయాలి

తుర్కపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

ముస్తాబాద్, డిసెంబర్ 24 : కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రి బర్తరఫ్ చేయాలని అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మండలంలోని తుర్కపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట అంబేద్కర్ సంఘం నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కళాకారులకు ఘన సన్మానం

జానపద కళాకారుడు తీగల రాజేశం గౌడ్‌ను సన్మానిస్తున్న సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నల, రమణాచారి తదితరులు

వేములవాడ రూరల్, డిసెంబర్ 24 : వేములవాడ రూరల్ మండలం నూకలమర్రి, చెక్కపల్లి గ్రామాలకు చెందిన జానపద కళాకారుడు తీగల రాజేశంగౌడ్, మిమిక్రీ ఆర్టిస్టు బుర్ర రవితేజను తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో భాగంగా ఇద్దరు కళాకారులను సత్కరించడంతోపాటు నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ జానపద కళాకారుల సంఘం అధ్యక్షుడు రమణాచారి, సాంస్కృతికశాఖ అధ్యక్షుడు వెన్నల, సభాధ్యక్షుడు సారేపల్లి కొండలరావు, అలేఖ్య, దైవజ్ఞ శర్మ, వంగ శ్రీనివాస్‌గౌడ్, సంచు లింగన్న, విజయ, కవిత, జానపద కళాకారుల సంఘం జిల్లా నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ నిబంధనలను పాటించేలా చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ
- కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేత

ఏవో రాంరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయకులు